# 3. రాఖీ పండుగ

**నేపథ్యం :**

అక్కయ్య ఆశీస్సులు
చెల్లెలి ప్రేమ
కలిపి కడతారు
రక్షణ కంకణంగా
రంగురంగుల రాఖీలు
రాఖీ పున్నమి తిరునాళ్ళు

అన్నయ్యయినా
తమ్ముడే అయినా
అక్క చెల్లెళ్ళపై
వాలనీయదు
ఒక ఈగ నైనా

రంగు రంగుల రాఖీలు – ఈ గేయం ద్వారా మీరేమి గ్రహించారు.

భారతదేశంలోని ప్రజలంతా ఒకే దారంలో గుచ్చబడిన పూలదండ వంటివారు. ఇక్కడ వివిధ సంస్కృతులు, ఆచారవ్యవహారాలు మనకు కనిపిస్తాయి. ఆయా రాష్ట్రాల ప్రజలు వారి వారి సాంప్రదాయాల ప్రకారం పండుగలను జరుపుకొంటారు. ఈ పండుగలు మన సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పడుతుంటాయి.

అటువంటి పండుగలలో ఒకటి **'రాఖీ పండుగ',** ఈ పండుగ సోదరి, సోదరుల మధ్యఉన్న ప్రేమ అనుబంధంలోని మాధుర్యము, అనుభూతిని ప్రత్యేకంగా చాటి చెపుతుంది. అన్నకు గాని, తమ్మునికి గాని ప్రేమ సూచకంగా సోదరి రాఖీ కట్టడం ఈ పండుగ యొక్క ప్రత్యేకత. ఈ పండుగను పలు ప్రాంతాలలో పలు విధాలుగా జరుపుకొంటారు. ఈ రాఖీ పూర్ణిమనే జంధ్యాల పూర్ణిమ, నారియల్ పూర్ణిమ అని కూడా పిలుస్తారు. ఇప్పుడు మనం ఈ పండుగను గురించి వివరంగా తెలుసుకొందాము.



ఈ పండుగ ప్రతి సంవత్సరము శ్రావణ పూర్ణిమ రోజు వస్తుంది. ఈ రోజు అక్కాచెల్లెళ్ళు పెందలకడనే లేస్తారు. తలంటు స్నానం చేసి కొత్తబట్టలు ధరిస్తారు. చక్కగా ముస్తాబై తమ సోదరుల ఇండ్లకు వెళ్తారు. మొట్టమొదట సోదరుని కూర్చుండబెట్టి నుదుట కుంకుమ బొట్టు పెడతారు. తరువాత కుడి చేతికి రాఖీ కట్టి హారతి ఇస్తారు. తీపి పదార్థములు తినిపిస్తారు. సోదరుడు తమకు ఎల్లప్పుడూ రక్షకుడిగా ఉండాలని కోరుతూ ఈ విధంగా చేస్తారు. అందుకే ఈ పండుగను 'రక్షాబంధన్' అని కూడా అంటారు.

పూర్వం అన్నదమ్ముల అభివృద్ధికి, రక్షణకు భగవంతుని ప్రార్థిస్తూ పవిత్రముగా తయారు చేసిన పసుపు దారమును అక్కా చెల్లెళ్ళు వారి చేతికి కడుతుండేవారు. తర్వాత పసుపు దారమునకు బదులుగా రంగురంగుల మెరిసే రాఖీలు వాడుకలోనికి వచ్చాయి.

రాఖీని కట్టినవారు తోబుట్టువులు కాకపోయిన వారిని స్వంత అక్కా చెల్లెళ్లుగా భావించడం లోకంలో పరిపాటి

అయింది. ఈ విషయాన్ని అనేక చారిత్రక సంఘటనలు ధృవపరుస్తున్నాయి.

ఒకసారి మేవాడ్ మహారాణి కరుణావతి రాజ్యాన్ని బహదూర్ షా ముట్టడించాడు. అతని అపార సైన్యాన్ని తన సైన్యంతో ఎదుర్కోవడం అసాధ్యమని మహారాణి తలచింది. వెంటనే అప్పుడు ఢిల్లీని పరిపాలిస్తున్న మొగల్ చక్రవర్తి హుమయూన్‌కు రాఖీని పంపించింది. వెంటనే ఆ చక్రవర్తి తన సైన్యంతో ఆమెకు రక్షణగా నిలబడి రాజ్యాన్ని కాపాడాడని చరిత్ర చెపుతుంది. దీనిని బట్టి మొగల్ చక్రవర్తులు 'రక్షా బంధన్' నియమాలు పాటించినట్లు తెలుస్తుంది.

అదే విధంగా చరిత్రపుటల్లో అలెగ్జాండర్ భార్య 'రోక్సానా' తక్షశిల రాజు పురుషోత్తముడిని తన సోదరుడిగా భావించి రాఖీ కడుతుంది. జగజ్జేతగా మారాలనే తపనతో గ్రీక్ యువరాజు అలెగ్జాండర్ క్రీ.పూ. 326లో భారతదేశంపై దండెత్తుతాడు. ఆ క్రమంలో బాక్ట్రియా (నేటి ఆఫ్ఘనిస్థాన్)కు చెందిన యువరాణి రోక్సానాను వివాహం చేసుకొంటాడు. ఆమె వివాహ సంబంధాన్ని ఉపయోగించుకొని మధ్య ఆసియా దేశాలను, ముఖ్యంగా జీలం, చీనాబ్ నదుల మధ్య ఉన్న రాజ్యాలను జయించాలని అలెగ్జాండర్ ఆలోచన. అలెగ్జాండర్ యుద్ధం ప్రకటిస్తాడు. పురుషోత్తముడి శత్రురాజు అంబీ, అలెగ్జాండర్‌ను భారతదేశంపై దండెత్తాలని ఆహ్వానిస్తాడు. పురుషోత్తముడు యుద్ధానికి సిద్ధమవుతాడు. అయితే అలెగ్జాండర్ భార్య రోక్సానా పురుషోత్తముడిని తన అన్నలా భావించి రాఖీ కడుతుంది. తన సోదరుడిని చంపవద్దని తన భర్త అయిన అలెగ్జాండర్‌ను కోరుతుంది. దీంతో అలెగ్జాండర్ యుద్ధం విరమించుకొంటాడు.

భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో అనేక మంది స్త్రీలు, పురుషుల చేతికి రాఖీలు కట్టారు. వారితో స్వాతంత్ర్య సమరంలో పాల్గొనడానికి ప్రతిజ్ఞలు చేయించారు. ఈ కారణంచేతనే బెంగాల్ నాయకుడు సురేంద్రనాథ్ బెనర్జీ రక్షాబంధన్ పండుగను జాతీయ పండుగగా పరిగణించడానికి ప్రయత్నించాడు.

**I. వినండి-సంభాషించండి.**

1. పండుగ అనగానేమో చెప్పండి.
2. వివిధ రకాల పండుగల పేర్లను చెప్పండి.
3. పండుగల ప్రాముఖ్యత గురించి మిత్రులతో చర్చించండి.

**II. చదవండి-ఆలోచించండి-రాయండి.**

**పదజాలం పెంపొందించుకుందాం.**


సంస్కృతి = సంస్కారం, నాగరికత; సాంప్రదాయం = పాదుకొన్న ఆచారం; ఆచారం = నడవడి, సంప్రదాయం, వాడుక; అనుభూతి = ప్రత్యక్షజ్ఞానం; సుఖదుఃఖాదులు పొందడం, అనుభవం; పెందలకడ = వేకువజాము; ముస్తాబు = అలంకరణ; పరిపాటి = అలవాటు; ధృవపరచుట = ఋజువుచేయుట; పరిగణించుట = లెక్కించుట; తోబుట్టువు = అక్క/చెల్లెళ్లు.

**III. వినండి-చర్చించండి-రాయండి.**

**అ. జవాబులు రాయండి.**

1. రాఖీ పండుగకు గల ఇతర పేర్లు...
2. రాఖీ పండుగను 'రక్షాబంధన్' అనుటకు కారణమును వివరించండి.
3. రక్షాబంధన్ పండుగను జాతీయపండుగగా పరిగణించడానికి ప్రయత్నించిన వాడు.

**ఆ. కింది అల్లికను పూరించండి:**



## IV. స్వీయ స్పందన

1. 'పండుగలు భారతీయ సంస్కృతికి నిలయములు' – మీ సొంతమాటల్లో రాయండి.
2. మేవాడ్ మహారాణి మొగల్ చక్రవర్తి నుండి ఏవిధంగా రక్షణ పొందిందో మీ సొంతమాటల్లో రాయండి.

## V. భాషావగాహన

**అ. గుర్తించబడిన పదములు ఏభాషాభాగములకు చెందినవో రాయండి.**

ఇక్కడ వివిధ సంస్కృతులు, ఆచారవ్యవహారాలు మనకు కనిపిస్తాయి.

**ఆ. కింది పదాలను మీ సొంతవాక్యాల్లో ఉపయోగించి రాయండి.**

1. అద్దం పట్టుట  2. పరిపాటి  3. పరిగణించుట

**ఇ. గుర్తించబడిన ప్రత్యయాలు ఏ విభక్తులో రాయండి.**

1. మనం ఈ పండుగను గురించి వివరంగా తెలుసుకొందాము

(అ) ప్రథమా విభక్తి  (ఆ) ద్వితీయా విభక్తి  (ఇ) పంచమీ విభక్తి

2. అక్కాచెల్లెళ్లు కుడి చేతికి రాఖీ కట్టి హారతి ఇస్తారు

(అ) షష్ఠీ విభక్తి  (ఆ) సప్తమీ విభక్తి  (ఇ) ద్వితీయా విభక్తి

3. తన సైన్యంతో ఎదుర్కోవడం అసాధ్యమని మహారాణి తలచింది.

(అ) తృతీయా విభక్తి  (ఆ) పంచమీ విభక్తి  (ఇ) సంబోధన ప్రథమా విభక్తి

**ఈ. కలిపి రాయండి.**

1. ప్రజలు + అంతా =  2. పద + అర్థము =
3. ప్రతి + ఏకత =  4. పురుష + ఉత్తముడు =

## VI. సృజనాత్మకత

1. రక్షాబంధన్, యమద్వితీయ (బావ్‌బీజ్) పండుగల తారతమ్యమును గూర్చి ఉపాధ్యాయుల నడిగిగాని, పెద్దల నడిగిగాని, అంతర్జాలంలో చూచిగాని తెలుసుకోండి, మిత్రులతో చర్చించండి.
2. పండుగల ప్రాముఖ్యతను గూర్చి అంతర్జాలంలో చూసి, తెలుసుకొని, దానిని గురించి రాయండి.

## VII. లేఖన నైపుణ్యాలు:

నీకు నచ్చిన పండుగను గూర్చి కింది అంశాల ఆధారంగా వ్యాసం రాయండి.

వివిధ రకాల పండుగలు → అందులో నీకు నచ్చిన పండుగ → నచ్చుటకు కారణము
↓
చేసికొను విధానము → తీసుకోవాల్సిన జాగత్తలు → ముగింపు

IA5JH1

### నేనివి నేర్చుకున్నా.

- భారతదేశపు ఆచారవ్యవహారాలు, సంస్కృతిసంప్రదాయాలు.
- రాఖీ పండుగ ప్రాముఖ్యత.

ఉ.సూ.: రాఖీలను ఎట్లు తయారు చేయవలెనో, వాటిని తయారు చేయుటకు ఏయే వస్తువులు కావలెనో సూచించవలెను.
వి.సూ.: రాఖీలనేగాక గ్రీటింగ్ కార్డులు మున్నగు వాటిని ఎట్లు తయారు చేయవలెనో నేర్చుకోవలెను.